తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# రహదారుల భూసేకరణ వేగవంతం
## - జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్



చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త: జిల్లాలో రహదారుల ఏర్పాటు కోసం భూసేకరణ పనులు వేగవంతంగా చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం జాతీయ రహదారులు, రైల్వే లైన్లకు సంబంధించి భూసేకరణ అంశాలపై జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ కడప-బెంగళూరు రైల్వే లైనుకు సంబంధించి ఇప్పటికే సర్వే పనులు పూర్తి అయ్యాయని, త్వరలో నోటిఫికేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం అనుమతి కోసం వేచి చూస్తున్నామన్నారు. అలాగే బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి కౌండిన్య అటవీ ప్రాంతంలో అనుమతుల కోసం ఎదురు చూస్తున్నామని, మిగిలిన ప్రాంతాల్లో దాదాపు పూర్తి అయ్యిందని వివరించారు. అలాగే చిత్తూరు-నాయుడుపేట ఆరు లైన్ల రహదారి నిర్మాణంకు సంబంధించి 1.13 కిమీ మేరకు భూసేకరణ చేయాల్సి వుందని, ఇందుకు సంబంధించి కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో వున్నాయని జెసి ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఓ వైపు రహదారు నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుండగా మరోవైపు రహదారుల నిర్మాణాలు సైతం వేగవంతంగా జరుగుతున్నాయని జెసి వివరించారు.

# రైతులకు కన్నీళ్ళు...
# వేసిన పంటకు తెగుళ్ళు
## -కొత్త రకం తెగుళ్ళు -పని చేయని పురుగు మందులు



పంటపొలాలకు పురుగుమందులను పిచికారి చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 13 ప్రభాతవార్త : ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారం వరకు వర్షాభావం రైతులను ఆందోళనకు గురించి చేసింది, నవంబర్ మాసంలో అడపా దడపా వర్షం కురిసినా చెరువులకు నీళ్లు చేరలేదు. సాధారణం కన్నా తక్కువ నమోదు అయ్యింది. దాంతో ఇక ఈ ఏడాది వ్యవసాయం ఎత్తుభారమే అని భావించిన రైతులకు 'మాండోస్' రూపంలో వరుణుడు కరుణించాడు.ఖాళీగా ఉన్న చెరువుల్లోకి నీళ్ళు చేరింది. దాంతో ఉత్సాహంతో రైతులు పంటలు వేసుకున్నారు. ముదిరి పోతున్న నారును నాటి పొలంగా మలచారు. అయితే రైతులు ఆనందం ఎంతో కాలం నిలవలేదు. చెరువుల్లో నీళ్ళు చేరిందనే సంతోషం ఓ వైపు అయితే వేసిన పంటలకు తెగుళ్ళు ఆశించి, రైతుల కంట కన్నీరు నింపింది.ప్రస్తుతం జనవరిలో మంచుతో అన్నదాతలు వేసిన పంటలకు తెగుళ్ళు సోకుతున్నాయి. ఓవైపు పెట్టుబడులు, మరోవైపు పంటలకు తెగుళ్ళు సోకుతున్నాయని పంటలకు అన్నదాతలు మందులను పిచికారి చేస్తున్నారు.

**తెగుళ్ళతో సతమతం:**

శ్రీకాళహస్తి డివిజన్‌లో 32వేల హెక్టార్లలో పంటలు పండిస్తారు.ఇందులో అత్యధిక శాతం వరినే పండిస్తారు.ఈ నేపథ్యంలో రైతులు వరి పంటను వేసుకున్నారు. అయితే కొన్ని చోట్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరి పైరు వెన్ను దశలో ఉంది. ఈ దశలో వెన్ను సగం బాగా ఉండగా సగం రంగుమారుతుంది. దీనిని బాగు చేయటానికి రైతులు వేల రూపాయల మందులు వాడుతున్నా కంట్రోల్ కావటం లేదని వాపోతున్నారు. వ్యవసాయ పనులు ఓ వైపు పంటలను కాపాడుకునే తాపత్రయం మరో వైపు దాంతో పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలు రైతులతో కిట కిటలాడు తున్నాయి. ఒక ఎకరాకు రూ.35వేలు ఖర్చు అవుతుందని ఈ పంటలను పండిస్తే చేతికొచ్చేది ఏమిటని వాపోతున్నారు.చివరి వరకు వరుణుడు కరుణించలేదని రోదిస్తే వరుణుడు కరుణించినా వాతావరణంలో మార్పుతో తెగుళ్ల సోకి నివారణకు పెట్టుబడులు పెట్టలేక ఇంట్లోని భార్యల పుస్తెలను తాకట్టుపెట్టుకునే పరిస్థితి చోటు చేసుకుందని రైతాంగం వాపోతున్నారు. రైతులకు ప్రభుత్వాలు అందించే రాయితీలు ఏ మాత్రం ఆదుకోవటం లేదని వాపోతున్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు రాయితీలు, బ్యాంకులో సొమ్ములు ఆయా ప్రభుత్వాల ప్రచారాలకు ఉపయోగపడుతున్నాయి కానీ రైతుల జీవితాలనుమార్చటం లేదని తల్లడిల్లుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

శ్రీకాళహస్తి వ్యవసాయక ప్రధానమైన ప్రాంతం.ఇక్కడ నిత్యం గ్రామాల్లోని ప్రజలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమౌతారు. అయితేప్రతి ఏడాది వేసిన పంటలకు తెగుళ్ళతో రైతులు తల్లడిల్లుతున్నారు. నివారణకు పెట్టుబడులు పెట్టలేక సరైన సమాచారం ఇచ్చే అధికారుల్లేక దుకాణం దారుడు చెప్పె సూచనలతో వేలాది రూపాయల మందులు మూడు నాలుగుసార్లు ఉపయోగిస్తూ చివరకు అప్పుల పాలౌతున్నారు.

### 27న కుప్పం నుంచి...
# యువగళం పాదయాత్ర
## - మూడు రోజుల్లో 29కి.మీ.లు.. ప్రజలు.. యువతతో భేటీ !



కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ ఈనెల 27న కుప్పం నుంచి యువగళం పాదయాత్ర 400 రోజుల పాటు 4వేల కి.మీ.ల మేర నారా లోకేష్ పర్యటన 2024ఫిబ్రవరి నెలదాకా కొనసాగనుంది. కుప్పం నుంచే ఈ పాదయా త్రకు శ్రీకారం చుట్టనుండడంతో తెదేపా రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి నేతలంతా కుప్పంలో నారా లోకేష్ పాదయాత్రలో పాల్గొననున్నారు. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు ఈనెల 26వతేది యువనేత నారా లోకేష్ కుప్పం చేరుకుంటారు. 27వతేది మధ్యాహ్నం 12గంటలకు మున్సిపల్ పరిధి లక్ష్మీపురం శ్రీ వరదరాజస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అనంతరం పాతపేట మసీదు వద్ద మైనార్టీనేతలను కలుస్తారు. అనంతరం బస్టాండ్‌కు చేరుకుని దివంగత ఎన్టీఆర్ విగ్రహంకు నివాళులు అర్పిస్తారు. అనంతరం కుప్పం పార్టీ కార్యాలయంకు చేరుకుంటారు. తదుపరి 4.45 గంటలకు సమీపంలోని ప్రైవేట్ స్థలంలో ప్రజలనుద్దేశించి నారా లోకేష్ ప్రసంగిస్తారని సమాచారం. అనంతరం కుప్పం బైపాస్ రోడ్డు మీదుగా శెట్టిపల్లి, బెగ్గిలపల్లి మీదుగా పిఇఎస్ వైద్య కళాశాల వరకు తొలిరోజు పాదయాత్ర సాగనుంది. అక్కడే తాత్కాలిక బస చేస్తారు. 28వతేది పిఇఎస్ ఆడిటోరియంలో యువతతో సమావేశమవుతారు. అనంతరం కడపల్లి, కనమలదొడ్డి మీదుగా శాంతిపురం వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. 29న శాంతిపురం నుంచి బయలుదేరి బడుగు మాకులపల్లి, కూతేగానిపల్లి, చెల్దిగానిపల్లి వరకు పాదయాత్ర చేపట్టి రాత్రి చెల్దిగానిపల్లి వద్ద బస చేస్తారని సమాచారం. మూడు రోజుల పాటు 29కి.మీ. మేర నారా లోకేష్ కుప్పంలో పాదయాత్ర చేపట్టనున్నారు.

# ప్రజాధరణ భరించలేకే..., జీఓ నంబర్ 1
## -ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం -భవిష్యత్తు పట్ల భరోసా కల్పించే సంక్రాంతి -టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త: ప్రపంచ వ్యాప్తంగా గల తెలుగువారిని అనుసంధానం చేయ డమే లక్ష్యమని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సంక్రాంతి సంబరాలకు కుటుంబ సమేతంగా సొంతూరు నారావారిపల్లికి చేరుకున్న ఆయన శుక్రవారం మీడియాతో కాసేపు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో లభిస్తున్న ఆధరణను చూసి భరించలేక వైసిపి ప్రభుత్వం జీఓ నంబర్ 1 తీసుకువచ్చినట్లు దుయ్యబట్టారు. టిడిపి, జనసేన, ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు పెడితే వైసిపి వారే స్వైరవిహారం చేస్తారు కానీ కేసులు మాత్రం ప్రతిపక్ష పార్టీ నాయకులపై పెట్టడం, జైలుకు పంపడం రాక్షస పాలనకు సంకేతమన్నారు. 2014-2019 మధ్య కాలంలో టిడిపి చేపట్టిన అనేక కార్యక్రమాలకు సంబంధించిన సంక్షేమ ఫలాలు ప్రజలకు లభించే సమయంలో రాక్షస పాలన ప్రారంభం కావడం ప్రజల దురదృష్టమన్నారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, మిడియా, ప్రజల పట్ల ప్రభత్వం అహంకార పూరితంగా వ్యవహరించడం, బానిసలుగా చూస్తున్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ మీటింగ్‌పై వైసిపి నేతల తిట్ల పురాణంపై దుయ్యబట్టారు. యావత్ ప్రపంచం కుగ్రామమైన నేపథ్యంలో ప్రభుత్వం ఎన్నికుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా తమ పోరాటం ఆగదన్నారు. భావితరాల భవిష్యత్తును కాపాడుకుంటూనే తెలుగువారి చైతన్యం కోసం ఆవిర్భ వించిన పార్టీ తెలుగు దేశమన్నారు. గడచిన మూడున్నరేళ్ళల అనేక కార్పోరేట్ కంపెనీలు పారిపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడ వున్నా మన తెలుగు వారందరూ తమ సొంతూరులో తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలసి సుఖశాంతులతో సంక్రాంతి సంబరాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# సామాన్య భక్తులకు పెద్దపీట
## -సర్వదర్శన సమయం తగ్గించండి -రేపు తిరుపతిలో గోదా కల్యాణం



తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి: కోట్లాదిమంది భక్తుల ఇష్టదైవమ్ ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న సామాన్యభక్తులకు పెద్దపీట వేస్తున్నామని టిటిడి ఇఓ ఏవిధర్మారెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనం ప్రాంగణంలో గోదా కల్యాణం జరుపుకుంటు న్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఓ"కార్యక్రమం జరిగింది. ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి భక్తులు తమ సూచనలు సలహాలతోబాటు ఫిర్యాదు కూడా చేశారు. రేపటి నుంచి తిరుమలలో సుప్రభాతసేవ పున:ప్రారంభి స్తున్నట్లు ఇఓ ధర్మారెడ్డి తెలిపారు. వైకుంఠ ఏకాదశిరోజు శ్రీవాణి టిక్కెట్‌లు పొంది దర్శనానికి వచ్చిన మేము తిరుపతి మాధవంలో వసతి అడిగితే తిరుమల సిఆర్‌ఓకు వెళ్ళమన్నారని, అక్కడకు వెళితే పద్మావతికి వెళ్ళమన్నారన్నారు. పద్మావతి విచారణ కేంద్రంలో అడిగితే అమర్యాదగా మాట్లాడారన్నారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో 500రూపాయలు వేదాశీర్వచనం టిక్కెట్ అడిగితే అక్కడి సిబ్బంది అమార్యాదగా ప్రవర్తించారని బెంగుళూరునుంచి పరమేశ్వర్ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన ఇఓ ఆ రోజు ఆ సమయంలో సిసి టివి ఫుటేజ్ పరిశీలించి, ఆ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కరీంనగర్ నుంచి భూపతిరెడ్డి, మంచిర్యాల నుంచి శ్రీకాంత్ మాట్లాడుతూ కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి తెలంగాణా ప్రభుత్వం 10 ఎకరాల స్థలం కేటాయించిందని, ఈ స్థలాన్ని ఇస్కాన్‌వారికి ఇస్తున్నారా?అని ప్రశ్నించారు. శ్రీవారి ఆలయాన్ని పునరుద్ధరించడానికి ఆర్థిక సాయం అందించాలనికోరారు. ఈ ప్రశ్నకు ఇఓ సమాధానంగా కరీంనగర్‌లో శ్రీవారి ఆలయా నిర్మాణానికి టిటిడి బోర్డు ఆమోదించింది. ఆలయం టిటిడియే నిర్వహిస్తుందని,మంచిర్యాలలో ఆలయ పునరుద్ధరణకు శ్రీవాణి ట్రస్ట్ నుంచి నిధులు అందించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. అలాగే తిరుమలలో సర్వదర్శనానికి 24గంటలు పైగానే పడుతుందని, ఈ సమయం తగ్గించాలని కోరారు. టైమ్‌స్లాట్ టోకెన్ల ద్వారా భక్తులు నాలుగు గంటల్లోపే సంతృప్తిగా దర్శనం చేసుకునే వీలుంటుందన్నారు. 28వతేదీ శనివారం తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని ఇఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. రథసప్తమిన ఒకేరోజు ఏడుకొండలవాడు ఉదయం నుంచి రాత్రి వరకు ఏడువాహనాలపై ఊరేగనున్నారన్నారు. రథసప్తమిని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, వాహనసేవలు వీక్షించే భక్తులకు ఆలయ మాఢ వీధుల్లోని గ్యాలరీల్లో వేచి ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, కాఫీ, టీ, పాలు అందించేందుకు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఎస్వీబిసి సిఇఓ షణ్ముఖకుమార్, ఎస్ఇ2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఇఓలు , ఆయా విభాగాల అధికారులు, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

### రాకెట్ కేంద్రాన్ని సందర్శించిన...
# ట్రైనీ ఐఎఎస్ అధికారులు



షార్ డైరెక్టర్, శాస్త్రవేత్తలతో ట్రైనీ ఐఎఎస్ అధికారులు

శ్రీహరికోట (తడ), జనవరి 13 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రాన్ని ట్రైనీ ఐఎఎస్ అధికారుల బృందం సందర్శించింది. 20 మందితో కూడిన ఈ బృందం భారత్ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా రాకెట్ కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. 2022 బ్యాచ్‌కి చెందిన ఈ ట్రైనీ ఐఎఎస్ అధికారులు షార్‌లో డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ కంట్రోలర్ శ్రీనివాసరెడ్డి, ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులతో సమావేశమయ్యారు. ఇక్కడి భాస్కర అతిథిగృహంలో ఈ బృందం షార్ అధికారులతో కలిసి భారత అంతరిక్ష పరిశోధన విజయాలపై మాట్లాడారు. ఎన్నో ప్రత్యకతలతో ప్రపంచ స్థాయి వసతులతో స్పేస్ పోర్టు ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో అత్యంత వేగంగా రాకెట్ విజ్ఞానం సామాన్యులకు అందుతుందో అనే విషయాలను శాస్త్రవేత్తలు ఈ బృందానికి తెలియజేశారు. ఈ బృందానికి చిరంజీవి ఆనంద్ నాయకత్వం వహించగా షార్ అధికారులతో పాటు సూళ్లూరుపేట తహశీల్దార్ అన్నంబాకం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ అధికారులు ఈ బృందానికి దగ్గరుండి షార్‌ను సందర్శించే విధంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### 16న స్వామిఅమ్మవార్ల...
# గిరిప్రదక్షిణం

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని గిరి ప్రదక్షిణ ఉత్సవం ఈ నెల 16 సోమవారం నిర్వహించబడుతుందని ఆలయాధికారులు ప్రకటించారు. ఇక్కడిఆలయంలో నిర్వహించే ప్రతి ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఏడాదిలో రెండు సార్లు కైలాసగిరి ప్రదక్షిణం నిర్వహించటం ఆనవాయితి. సంక్రాంతి కనుమ రోజు నిర్వహించే గిరి ప్రదక్షిణం కైలాసగిరు ల్లోని ముక్కోటి దేవతలకు మహాశివరాత్రి సందర్భంగా జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణానికి ఆహ్వానంగా అభివర్ణిస్తారు. శివరాత్రి కళ్యాణోత్సవం తరువాత జరిగే గిరి ప్రదక్షిణను తన వివాహానికి వచ్చిన దేవతల్ని తిరిగి వారి స్థావరాలకు చేర్చటం అని చెబుతారు. సుమారు 21 కిలో మీటర్ల గిరి ప్రదక్షిణలో ఎన్నో గ్రామాలున్నాయి. ప్రతి గ్రామం వద్ద స్వామి అమ్మవార్లకు ఘనస్వాగతం చెబుతారు. సుమారు 16 గ్రామాల్లో ఆ రోజు పండగ జరుపుకుంటారు. గిరిప్రదక్షిణ గ్రామాల్లో కనుమకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏడాదిలో రెండుసార్లు నిర్వహించే గిరి ప్రదక్షిణకు ఈ ఏడాది సుమారు 3లక్షల మంది హాజరుకావాలని శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి ప్రకటించారు.సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన సోమవారం స్వామి అమ్మవార్లు తమ గ్రామాలకు వస్తారు. మామిడితోరనాలు, ముగ్గులతో ముస్తాబు చేస్తారు. ఆదివారం ప్రదోష మూర్తులు గిరిప్రదిక్షణకు వెళుతుందని వివరించారు. ఉదయం ఆలయం నుంచి బయలుదేరు స్వామి అమ్మవార్లు సాయంత్రం పట్టణానికి చేరుకొని గ్రామోత్సవం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఆలయంలో రెండు రోజుల పాటు భక్తుల ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. దేవస్థానమే అభిషేకాలు నిర్వహిస్తారు.గతంలో ముళ్ళ పొదలు, రాళ్ళురప్పలు కల్గిన కొండ దిగువప కాలిపడకప వెళ్ళే వారు. కానీ మారిప కాలానుగుణంగా కొండ చుట్టూ సిమెంటు రోడ్డు ఎంఎల్ఏ పట్టుబట్టి సిమెంటు రోడ్డు వేశారు. దాంతో ఇదో వేడుకగా మారింది. స్వామి అమ్మవార్లను మోసే కూలిలకు కూడా సులభమైంది. గ్రామాల్లో సందడి చోటు చేసుకుంది. కొత్త ధర్మకర్తల మండలి, కొత్త ఇఓ సారథ్యంలో మొదటి గిరి ప్రదక్షిణ గురువారం నిర్వహించనున్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు...
# సంక్రాంతికి కూడా జీతాలు ఇవ్వరా!
## పండగపూట కార్మిక కుటుంబాలు పస్తులు ఉండాలా...



నగరి, జనవరి 13 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు పండుగ పూట కూడా జీతాలు ఇవ్వరా... అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేసేటటువంటి పారిశుధ్య కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదని, అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వం కాని, సంబంధించి కాంట్రాక్టు కాని స్పందించడం లేదని, ఇప్పటికే మూడు నెలలు పెండింగ్ జీతాలున్నప్పటికీ కనీసం సంక్రాంతి పండుగకు కూడా జీతాలు చెల్లించలేని దీన స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని, సంబంధించిన కాంట్రాక్టర్‌ని జీతాలు అడిగితే మాకు బిల్లులురాలేదని, ప్రభుత్వం ఇవ్వలేదని కుంటి సాకులు చెబుతున్నారని వాపోయారు. సంక్రాంతికి జీతాలు వేస్తామని చెప్పి జీతాలు వేయకపోగా కార్మికులను పస్తులు పెట్టే పరిస్థితుల్లో కాంట్రాక్టర్ ఉన్నారని, సంబంధించిన కాంట్రాక్టర్ కార్మికులకు రావాల్సిన జీతాలు ఇవ్వడంలో కాని, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడంలో కాని నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీనిపైన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న వైద్యాధికారులు కనీసం కార్మికులకు బిల్లులు చెల్లించలేదని, కావున సంబంధించిన కాంట్రాక్టర్‌తో మాట్లాడి జీతాలు వేయాలనిడిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీతాల కోసం ఫిబ్రవరి 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం వైద్యాధికారి బాలకృష్ణ నాయక్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి నగోమి, సెల్వి, ప్రభాకర్, ఆశ జెర్సీ, కృష్ణమ్మ, రూతు, రాజశేఖర్, కార్మికులు పాల్గొన్నారు.

# వెబ్ ల్యాండ్ అక్రమాలపై కలెక్టర్ కొరడా

- భూముల స్వాధీనంకు ఆదేశాలు జారీ
- పెద్దపంజాణి మండలంలో అక్రమార్కులపై చర్యలు ప్రారంభం

**చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:** వెబ్ ల్యాండ్‌లో అక్రమాలకు పాల్పడిన పలువురిపై కలెక్టర్ హరినారాయణన్ కొరడా ఝుళిపించారు. పెద్దపంజాణి మండలం వీరపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నెం.31/1, 34/2లతో పాటు మరికొన్ని సర్వే నెంబర్లకు సంబంధించి వెబ్ ల్యాండ్‌లో అక్రమంగా నమోదు చేసుకొన్న 161.98 ఎకరాలను కలెక్టర్ హరినారాయణన్ రద్దు చేశారు. ఇలా అక్రమంగా వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసుకొన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామంకు చెందిన సుందరాచ్చారి, ఆయన భార్య ఉమావాణిల పేరు మీద ఈ భూమిని వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసుకోవడం జరిగింది. ఈ భూమి అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో అప్పటి నుండి ఈ భూములపై ప్రభుత్వం విచారణ సాగిస్తోంది. ఈ భూములను అక్రమంగా వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసుకొన్న పలువురిపై రెవెన్యూ అధికారులు ఇప్పటికే చర్యలు తీసుకొన్నారు. కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఈ భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారణ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ భూములను సత్వరం స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశిస్తూ జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు పెద్దపంజాణి మండలం వీరపల్లి పంచాయతీ పరిధిలో వెబ్ ల్యాండ్‌లో అక్రమంగా నమోదు చేసుకొన్న భూముల వివరాలను సేకరించి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధం చేసింది.

## ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

**శాంతిపురం, జనవరి 13 ప్రభాతవార్త :**



మండలంలోని సొన్నేగానిపల్లి పంచాయతీలో ప్రభుత్వ స్థలంలో ఉన్న ఆక్రమణలను తహశీల్దార్ లోకేశ్వరరావు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ స్థలాల్లో పేదలు 58మందికి ఇళ్ల స్థలాల కోసం ఇంటి పట్టాలు ఇచ్చారు. అయితే ఈ భూములను ఆరుమంది రైతులు ఆక్రమించుకున్నట్లు గుర్తించి ఆక్రమణలు తొలగించారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, విఆర్వో, సర్వేయరు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు తెదేపా నేతలచే భోగిమంటలు

**కుప్పంరూరల్, జనవరి 13 ప్రభాతవార్త :** తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శనివారం కుప్పం ఎన్టీఆర్ విగ్రహం వద్ద భోగిమంటలు కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం తెలిపారు. వైకాపా ప్రభుత్వం తెదేపా నేతలపై నమోదు చేస్తున్న తప్పుడు కేసుల ఎఫ్ఐఆర్ కాపీలు, జిఓనెం 1 ప్రతులను భోగిమంటల్లో వేసి నిరసన తెలపడం జరుగుతుందన్నారు. తెదేపా నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## రేషన్ బియ్యం ఇవ్వ లేదని గ్రామస్తుల ధర్నా

**పెద్దపంజాణి జనవరి 13 ప్రభాతవార్త :**



పెద్దపంజాణి మండలం ముత్తుకూరు పంచాయతీ నెర్నిపల్లి గ్రామస్థులు రేషన్‌బియ్యం అంధించలేదని శుక్రవారం సచివాలయం ఎదుట భారీస్థాయిలో ధర్నా చేసారు.గ్రామంలో ఉన్న డీలర్ తమకు రెండు నెలలుగా తమకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం అందించలేదని తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని వాపోయారు.డీలర్ తమకు రాష్ట్రకేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు.ఈ విషయంగా తహశీల్దార్‌ను వివరణ కోరగా దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## క్రీడలతో మానసిక వికాసం

- జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

**చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:**



క్రీడలతో ప్రతి ఒక్కరికి మానసిక వికాసం కలుగుతుందని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జడ్పీ ఉద్యోగులకు జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలతో పాటు వివిధ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న ఘనత ఉద్యోగులకు మాత్రమే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఇఓ విజయేంద్రరావు, డ్వామా పిడి దుర్గాభవాని, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగజ్యోతి, పలువురు అధికారులు పాల్గొన్నారు

## నేడే అయ్యప్ప మకరజ్యోతి దర్శనం

**సదుం, జనవరి13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని యర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి వారి ఆలయంలోశనివారం అయ్యప్ప మకరజ్యోతి దర్శనం జరుగుతుందని ఆలయ మేనేజరు భాస్కరరాజు తెలిపారు.ఉదయం అయ్యప్ప స్వామి ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు భక్తులు ఇరుముడులు చెల్లిస్తారు. మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి తిరువాభరణాలను స్వామికి అందజేస్తారు. సాయంత్రం ఆలయం వద్ద మకర జ్యోతి దర్శనం కల్పిస్తారు. ఇందుకోసం ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద పలురకాలైన ఏర్పాట్లు చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి

**కుప్పంరూరల్, జనవరి 13 ప్రభాతవార్త :**



ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కుప్పం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా॥ మహేష్ కోరారు. శుక్రవారం వ్యర్థ ఎల క్ట్రిక్ పదార్థారాలను సేకరించి వాటిని రీసైక్లింగ్ చేసే కార్యక్రమంను కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో చేపటా ్టరు. లయన్స్‌క్లబ్ తరపున పర్యావరణ పరిరక్షణకు మొక్కలు సైతం నాటడం జరుగుతుందన్నారు. కెఇసి వైస్‌ఛైర్మన్ డా॥ సెనీల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాత ఎలక్ట్రిక్ వసుతవులను సేకరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు సోమశేఖర్, కోశాధికారి సెంధిల్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ పిజి సెల్వం, డైరెక్టర్లు శివ, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, హెచ్ఓడి మాధవన్, పిఆర్వో ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుంగనూరులో పెద్దరెడ్డి మాత్రమే గెలవాలి

**సదుం,జనవరి13 ప్రభాతవార్త :** వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కూడా పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుమారు 70 వేల మెజారిటీతో గెలవడం ఖాయమని వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సదుంలో విలేకరులతో మాట్లాడుతూ చల్లా రామచంద్రారెడ్డి కాదని, ఎవరు నిలబడినా ఇక్కడ గెలిచేది అన్న మాత్రమేనని చెప్పారు. జీవిత కాలంలో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి కాని, చల్లా రామచంద్రారెడ్డి కాని ఎమ్మెల్యేలు కాలేరని జోస్యం చెప్పారు. సమావేశంలో ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ ఆలయంలో మండల పూజ

**సదుం,జనవరి13 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలం మిట్టమీద రాచపల్లె ఎల్లమ్మ దేవి ఆలయంలో శుక్రవారం మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం కలశస్థాపన, అనంతరం హోమాలు నిర్వహించి అమ్మవారికి అభిషేకం జరిపించారు. అమ్మవారిని ప్రతే ్యకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్‌దీక్షితులు, మల్లేష్ భరద్వాజ్ పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ నిర్వహకులు కృష్ణారెడ్డి, చెన్నకేశవరెడ్డి,పార్థసారధిరెడ్డిలు భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

## తెలుగు సంస్కృతి... సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి



**కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త :** తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని కుప్పం ఐఆర్ఎం డిగ్రీ కాలేజ్ అధినేత బిఎం దయానిధి పేర్కొన్నా రు. శుక్రవారం కళాశాలలో సంక్రాంతి సంబరాల ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంప్రదాయ దుస్తుల వేషధారణ, మెహందీ, హరి కథ, ఫుడ్‌ఫెస్ట్, రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. సంప్రదా య వేషధారణ ధరించిన వారిలో సెకండియర్ బైపిసి చదువుతున్న లుబ్నా ఖానమ్ మిస్ ఐఆర్ఎంగా నిలిచారు. అలాగే జీవనశ్రీ, చందన, బాలుర విభాగంలో శ్రీహర్ష, యుగంధర్, తమిళ్‌సెల్వన్‌లు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధా ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంట్లో దొంగతనంకు పాల్పడిన నిందితులు అరెస్టు

- రూ.2 లక్షల విలువ చేసే బంగారు నగలు, వెండి అభరణాలు స్వాధీనం

**చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:** చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దుర్గానగర్‌కాలనీలోని ఓ ఇంట్లో జనవరి 8వ తేదీ దొంగతనానికి పాల్పడిన నిందితులను టుటౌన్ పోలీసులు అరెస్టు చేసి నిందితుల నుండి 2 లక్షల రూపాయల విలువైన 48 గ్రాముల బంగారం, వెండి అభరణాలను ఇన్స్‌పెక్టర్ భాస్కర్, ఎస్ఐ మల్లికార్జున్‌లు స్వాధీనం చేసుకొన్నారు. ఈ నెల 8వ తేదీ రాత్రి దుర్గానగర్‌కాలనీ బాలమురుగన్ వీధిలోని ఓ ఇంట్లో యాజమాని జి.బాలమురళి, అతని భార్య మొదటి అంతస్తులోని ఒక పోర్షన్‌కు తాళం వేసుకొని ప్రక్కనే వున్న మరో ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. ఈ క్రమంలో తాళం వేసిన పోర్షన్‌లోకి దొంగలు ప్రవేశించి లాకర్‌లో వుంచిన 2.02 లక్షల రూపాయల విలువైన బంగారం, వెండి అభరణాలు దోచుకెళ్ళారు. ఈ మేరకు ఇంటి యాజమాని బాలమురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన టుటౌన్ పోలీసులు ఇళ్ళ దొంగతనాలకు పాల్పడే పాత నేరస్తుల వివరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తెలుసుకొన్నారు. నిందితులకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందడంతో ఇన్స్‌పెక్టర్ భాస్కర్, ఎస్ఐ మల్లికార్జున్‌లు సిబ్బందితో కలిసి చిత్తూరు-వేలూరు రహదారిలో కొత్త కలెక్టరేట్ మెయిన్ గేటు వద్ద కాపు కాశారు. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్ర వేలూరు టౌన్ వసంతాపురంకు చెందిన రంజిత్‌కుమార్ అలియాస్ రంజిత్(40), వేలూరు కోసపేటకు చెందిన కె.మురుగన్(42)లను ఇన్స్‌పెక్టర్ బాస్కర్, ఎస్ఐ మల్లికార్జున్‌లు పట్టుకొని అరెస్టు చేసి వారి నుండి 2.02 లక్షల రూపాయల విలువైన బంగారు, వెండి అభరణాలను స్వాధీనం చేసుకొన్నారు. ఈ మేరకు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రోజుకో నిర్ణయం.. గురువులు గందరగోళం

- సర్దుబాటు ఉత్తర్వులపై విమర్శలు

**కోట, జనవరి 13 ప్రభాతవార్త :** ప్రభుత్వం రోజుకో ఉత్తర్వులు జారీ చేస్తుండటంతో ఉపాధ్యాయుల్లో గందరగోళం నెలకొంది. పదోన్నతులు, బదిలీలపై కొన్నాళ్లుగా అనిశ్చితి కొనసాగుతోంది. తాజాగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ సర్కులర్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టకుండా సర్దుబాటు చేస్తే సర్వీసు ఇంక్రిమెంట్లపరంగా తీవ్రంగా నష్టపోతామని ఉపాధ్యాయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ప్రధానోపాధ్యాయులు పదోన్నతికి సుముఖత వ్యక్తం చేసినా స్కూలు అసిస్టెంట్లకు కాకుండా ఎస్‌జిటిలను మాత్రమే సర్దుబాటు చేయనున్నారు. ఓ వైపు పదోన్నతులు, మరోవైపు బదిలీల ప్రక్రియ అర్థాంతరంగా ఆగింది. వాటిని పక్కనపెట్టి సర్దుబాటు చేయాలన్న నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు ఖండిస్తున్నాయి. స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. విద్యాభివృద్ధిలో సమూలమైన మార్పులు తీసుకొస్తామని గొప్పలు చెప్తున్నారే తప్ప ఆచరించడం లేదని ఆ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

## కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు!

**కోట, జనవరి 13 ప్రభాతవార్త :** సంక్రాంతి పండగ ముసుగులో కోడిపందేల నిర్వాహకులు మండలంలో ఎక్కడైనా జూదం, కోడిపందేలు, డైమండ్‌డబ్బా వంటివి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోట ఎస్ఐ జి.పుల్లారావు చెప్పారు. ఆయన శుక్రవారం కోటలో విలేఖరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సుఖసంతోషాలతో కుటుంబ సమేతంగా జరుపుకోవాలని కోరారు. కోడిపందేలకు వెళ్లి పోలీసుస్టేషన్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తుంటే ప్రజలు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు

## రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

**పెళ్లకూరు, జనవరి 13 ప్రభాతవార్త :**



పెళ్లకూరు మండలం చిల్లకూరు పంచాయతీ జీలపాటూరు గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు భాస్కరయ్య మాట్లాడుతూ రైతులు వరిసాగులో తక్కువ ఖర్చుతో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలని తెలిపారు. వరిసాగులో విత్తనశుద్ధి, ఎరువుల యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి నాయుడుపేట మండల వ్యవసాయాధికారి గణేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ, సర్పంచ్ కందమూడి శివకుమార్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శ్రీనివాసులు, వేణుగోపాల్, అన్ని రైతు భరోసా కేంద్రాల విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

## సబ్‌కోర్టును మంజూరు చేయండి

**సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త :**



సూళ్లూరుపేటలో జూనియర్ సివిల్ జడ్జి సబ్ కోర్టును మంజూరు చేసేందుకు సిఫార్సు చేయాలని స్థానిక న్యాయవాదులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు కోర్టు మంజూరుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బైరి పార్థసారధిరెడ్డి, తుమ్మా ప్రేమ్‌కుమార్, చింతపూడి మురళీ తదితరులు పాల్గొన్నారు.

## తడలో సంక్రాంతి సంబరాలు

**తడ, జనవరి 13 ప్రభాతవార్త :** తడ మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యుడు కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలాధ్యక్షుడు కె.రఘురెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. భోగి మంటలు వేసుకొని సంబరాలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు అనంతరం ముగ్గుల పోటీల విజేతలను ఎంపిక చేశారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళ నిరాశ చెందకుండా అనంతరం అందరికీ బహుమతులు అందజేశారు. ఎంపిడిఓ ఎ.వి.మురళీకృష్ణ, తహశీల్దార్ ఎస్.రామయ్య, జడ్పిటిసి ఇందుమతి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

**వాకాడు, జనవరి 13 ప్రభాతవార్త :** మండలంలోని ప్రభుత్వ కార్యాలయంలోని శుక్రవారం భోగి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని ఎంపిడిఓ గోపినాథ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి అందజేసారు. అదే విధంగా వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదరరెడ్డి చేతుల మీదుగా ఎంపిడిఓ గోపినాథ్ ఇరువురు భోగి మంటలు వేసి సంబరాలు జరిపారు. మండలంలోని ప్రతి చోట ప్రజలు భోగి,



సంక్రాంతి సంబరాలు జరుపుకుని అష్టైశ్వర్యంతో, సిరి సంపదలతో ప్రతి ఒక్కరు ఉండాలని కోరుకుంటూ అదే విధంగా ఎమ్మెల్యే వరప్రసాదరావుకి, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకటగిరి నియోజకవర్గం అసెంబ్లీ సమయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వాకాడు మండల ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పండగ వేళ రద్దీ ప్రయాణం

**కోట, జనవరి 13 ప్రభాతవార్త :**



జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా పల్లెలన్నీ కళకళలాడు తున్నాయి. చదువుకోవడానికి దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు కోట మండలంలోని పలు విద్యాసంస్థల్లో ఉన్నారు. ప్రస్తుతం సంక్రాంతి పండక్కి ఊళ్లకు వెళ్లే వారి కష్టాలు అన్నీ ఇన్నీ కాదు. ఇదే ఆసరాగా ప్రైవేటు వాహనదారులు ఇష్టారాజ్యంగా ఛార్జీలు పెంచేసి ప్రయాణికులు దోచుకుంటున్నారు. ఇటీవలే ఆర్టీసీ సాధారణ ఛార్జీలను సైతం పెంచేసింది. పండుగ ప్రత్యేక బస్సులు ఈ ఛార్జీలతోనే నడుస్తున్నాయి. ప్రైవేటు వాహనదారులు పండుగ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఛార్జీలు మరింతగా పెంచేశారు. విద్యార్థులు, ఇతర ఉద్యోగులు ఛార్జీలు చూసి ఖంగుతింటున్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని వాకాడు డిపో కోట-నెల్లూరు, కోట-తిరుపతికి అదనంగా బస్సులు నడపలేక చేతులెత్తేసింది. దీంతో రెట్టింపు ఛార్జీలే ప్రయాణికులకు తడిసిమోపెడవుతున్నాయి.

## పేదలకు నూతన వస్త్రాలు అందించిన రాజినేని

**చిల్లకూరు జనవరి 13 ప్రభాతవార్త :** మండలంలోని చేడిమాల గ్రామంలో ఏర్పాటు అయివున్న ఆర్‌ఆర్‌సిటీ వ్యవస్థాపకులు శ్రీనివాసులునాయుడు,శిరిషాలు శుక్రవారం పేద ప్రజలకు నూతన వస్త్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతు ట్రస్టు ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి చేసుకొని 6 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి ఏటా సంక్రాంతికి పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు.చేడమాల,నల్లయ్యగారిపాళెం గ్రామాలలో సుమారుగా 6 వందల మంది పేద ప్రజలకు ఇవ్వడం జరిగిందని అన్నారు.ఈకార్యక్రమంలో ఛైర్మన్ పిచ్చయ్యనాయుడు, కార్యదర్శి రామయ్యనాయుడు, సభ్యులు బాబు, తదితరులు పాల్గొన్నారు.

## కోతలకు సిద్ధంగా ఎలిది పైర్లు

- పరటలోకి వెళ్లడానికి దారి లేక రైతులకు ఇబ్బందులు

**దొరవారిసత్రం, జనవరి 13 ప్రభాతవార్త :**



దొరవారిసత్రం మండలం అక్కరపాక, ఎన్ఎం అగ్రహారం, పోలిరెడ్డిపాలెం, గొల్లపాలెం, కల్లూరు, సూరపు అగ్రహారం, కల్లూరుకండ్రిగ తదితర గ్రామాల్లో ముందుగా వేసిన ఎలిది పంట కోతకు సిద్ధంగా ఉంది. అయితే ఈసారి వర్షాలు ఎక్కువగా కురవడంతో పొలాల్లో నీరు ఎక్కువై ఎటూ వెళ్లడానికి మార్గం లేక పండిన పంటలోనే నీరు నిలిచిపోయింది. ఈ నీరు ఎక్కువగా ఉండటంతో పంట కోయడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు కొన్ని గ్రామాల్లో కొంత పంట దెబ్బతిన్నది. ఆ పంటకు బదులు మరో పంట వేశారు. దీంతో పొలాల్లోకి మార్గం లేక అటు పండిన పంట కోసుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పండుగలు అయ్యే వరకు ఏమీ చేయలేమని వరి కోత కూలీలు చెప్పడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ముందుగా వేసిన మెట్ట ప్రాంతంలో ఎలిది పైరు 90 శాతం పూర్తయిన కోతకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

## క్రీడలను పెంపొందిస్తున్న వెంకటగిరి రాజవంశస్థులు

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద

**వెంకటగిరి, జనవరి 13, ప్రభాతవార్త:**




రాజవంశస్థులు క్రీడలకు బ్రిటీషు కాలం నుంచి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వచ్చారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. కెఆర్‌పిఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజాలు క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. క్రికెట్ కోసం తారకరామా క్రీడా ప్రాంగణాన్ని కూడా వారు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. యువత ప్రత్యేక క్రీడల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొంటే ఉల్లాసంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌పిఆర్ ట్రస్టు ఛైర్మన్ కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు, ఎంపీపీ తనూజంరెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల పట్ల శ్రద్ధ చూపాలి : సొసైటీ అధ్యక్షుడు

**బాలాయపల్లి, జనవరి 13, ప్రభాతవార్త:** యువత క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జయంపు సొసైటీ అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జయంపు గ్రామంలో ఎబిఆర్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటును శుక్రవారం నాడు జయంపు పిఎసిఎస్ అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు చాలా మంది ఉన్నారని, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ఉత్తేజం, ఉత్సాహం పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, జయంపు ఎల్‌బిఆర్ యూత్, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పూడి గ్రామంలో సంక్రాంతి సంబరాలు

తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త :
నేటి నుంచి పూడి గ్రామంలోసంక్రాంతి సంబరాలను స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ మరియు పూడి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వహాకులు తెలిపారు. ప్రతి ఏడాదిలాగానే ఈఏడాది కూడా గ్రామంలో అందరు కలసికట్టుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ. దీంతో నేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు సహకారంతో బాల్‌బాడ్మింటన్, వాలీబాల్ పోటీలు, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఇంటికి ఒక్కొక్క మామిడి మొక్కలను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలకు పరిశ్రమలశాఖ డైరెక్టర్ ఐఎఎస్ అధికారిణి గుమ్మళ్ళ సృజన, ప్రముఖ న్యాయవాది కదిరిరవితేజ, స్పందన చైర్‌పర్సన్



సుగుణశీల మరియు దేవాదాయశాఖ మాజీ కమిషనర్ ఐఎఎస్ అధికారి గుమ్మళ్ళ బలరామయ్యలు హాజరవుతారని మరియు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 300 మామిడిమొక్కలను ఇంటింటికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు చైర్‌పర్సన్ గౌరీశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, 16న పండరీ భజన, కోలాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను కార్యదర్శి జలగంబాలమురళీ, జలగంశ్రీనివాసులునాయుడు, పి.మాధవ నాయుడు, జలగం హేమంత్‌నాయుడు, జి.సుమంత్, చక్రినాయుడు, శ్యామ్, రత్నయ్య, భాస్కర్‌నాయుడు, శేషమనాయుడు, మునిశేఖర్ ఆధ్వర్యంలో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

## బిసిలకు చంద్రబాబే దేవుడు

– తెదేపా పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు సదాశివం

తిరుపతి ప్రెస్‌క్లబ్, జనవరి 13 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని బిసిలకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడే దేవుడని తిరుపతి తెదేపా పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. నారావారిపల్లిలో సంక్రాంతి పండగకు విచ్చేసిన తెదేపా అధినేత చం ద్రబాబునాయుడును సదాశివం కలసి పండగ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సదాశివం తిరుపతి పార్లమెంట్ జిల్లా పరిధిలో బిసిల స్థితిగతులను చంద్రబాబుకు వివరించారు. వైకాపా పాలనలో బిసిలు పడుతున్న కష్టాలను వివరించారు. 2024లో మరలా తెదేపా అఖండ విజయం సాధిస్తుందన్నారు. ఈసందర భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని అందరికి తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి!



తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త :
పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్ళకూరు మండలం టెంకాతోపు గ్రామానికి చెందిన పోలయ్య కెవిబిపురం మండలం తిమ్మసముద్రం గ్రామంలో ఉన్న తన అక్కవారింటికి వెళ్తుండగా కొత్తకండ్రిగనుంచి ఎదురుగా ద్విచక్రవాహనంలో శ్రీకాళహస్తి వైపు వస్తున్న నాగరాజు(32) వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పోలయ్య అక్కడికక్కడే మృతిచెందగా కొత్తకండ్రిగ గ్రామంలో వెల్డింగ్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న నాగరాజు శ్రీకాళహస్తిలో ఉన్న తన భార్యను తీసుకురావడానికి బయలుదేరాడు. ఈనేపథ్యంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. నాగరాజు తీవ్రంగా గాయపడడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పట్టణంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ కూడ సాధ్యం కాదని చెప్పడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. దీంతో శుక్రవారం స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగరాజు మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని శుక్రవారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. టుటౌన్ ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య నవీన, కుమార్తె భవిత(4), కుమారుడు అశ్విన్(3)లు ఉన్నారు.

## బలిజ అభ్యుదయ సంఘంచే చైర్మెన్‌కు సత్కారం

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తిలోని బలిజ ఎంప్లాయిస్ అభ్యుదయ సేవా సంఘంచే శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి చిత్తూరుజిల్లా ఉద్యోగుల సంఘం సారధ్యంలో నూతనంగా ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఆశోక్ కుమార్, నీలం నరేంద్ర సారధ్యంలో శ్రీనివాసులును సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరుజిల్లాలో బలిజల సమస్యలు ఎక్కడ ఉన్నా తనదృష్టికి వస్తే పరిష్కరించుటకు ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం చైర్మెన్ బాధ్యతలను అప్పగించిన శ్రీకాళహస్తి శాసనసభ్యుడు అభినందనీయుడు అన్నారు. బాధ్యతలు స్వీకరించిన యువ నాయకుడు అంజూరు తారక శ్రీనివాసులు గతంలో ఏ చైర్మెన్ చేయని విధంగా స్థానిక అనుబంధ ఆలయాల జీర్ణోద్ధారణకు పూనుకోవటం అబినందనీయం అన్నారు. ఈకార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షులు బాలిశెట్టి ప్రభురెడ్డి, పి.వి. లక్ష్మీప్రసాద్, తోట లక్ష్మీనారాయణ, పూల సురేష్, సి.ప్రసాద్, తోట మధుసూధన్, డాక్టర్ ముత్యాల రవికుమార్, కె ఎల్ జయప్రకాష్, వంశీకృష్ణ, మోహన్, అడ్వకేట్ లక్ష్మీనారాయణ సంయుక్త కార్యదర్శి, స్థానిక నాయకులు స్వర్ణమూర్తి, అనందకుమార్, సూర్యప్రకాష్, రమణ, జనార్ధన్, హేమంత్‌కుమార్, రాజేష పాల్గొన్నారు.

## పాడిమోసిన ఎంఎల్ఏ,ఎంపి



శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి వైకాపా నియోజకవర్గ పరిశీలకులు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డి తండ్రి ఓడూరు సుందరరామిరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆతని దహన కార్యక్రమాలకు తిరుపతి పార్లమెంటు సభ్యుడు మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిలు హాజరయ్యా రు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లో శాసనసభ్యునికి నమ్మిన బంటుగా ఉన్న గిరిధర్‌రెడ్డి తండ్రి మృతి చెందటంతో ఆయనకు పరామర్శించారు. శుక్రవారం దహన కార్యక్రమాలకు హాజరైన వారు పాడె మోసి నివాళి అర్పించారు. శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పలువురు వైకాపా నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

## హోంగార్డు తీరుపై స్థానికుల గుర్రు!

–సమస్యను పరిష్కరించిన చైర్మెన్



శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఉదయం 'స్థానిక' వివాదం చోటు చేసుకుంది. ఒక దశలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. స్థానికులు కలసి ఆలయం వద్దకు వచ్చి రచ్చ రచ్చ చేసారు. రాతమూలకంగా ఫిర్యాదు చేయటానికి ప్రయత్నించగా చైర్మెన్ కలుగజేసుకొని పంచాయతీ జరిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉదయం 8గంటల తరువాత ఎవరైనా సరే టిక్కెట్లు కొనుగోలు చేయాలని దేవాదాయశాఖ ఆదేశించింది. అంతేకాక స్థానిక చైర్మెన్ మూడు నెలల క్రితమే ఎవరైనా సరే టిక్కెట్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. దాంతో ఇక్కడ పని చేసే హోంగార్డులును బదిలి చేసి, కొత్త హోంగార్డులను నియమించారు. శుక్రవారం ఉదయం కంచుగడప వద్ద విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు స్థానికుడు చంద్ర కుటుంబ సమేతంగా రాగా ఆయన్ను హోంగార్డు అడ్డగించారు. టిక్కెట్లు లేనిదే ఎవరైనా అనుమతించరాదన్న నిబంధనలతో అడ్డుకున్నారు. దాంతో స్థానికుడు అయిన చంద్ర స్థానికులకు టిక్కెట్లు ఏమి? అంటూ వాగ్వివాదం చోటు చేసుకుంది. దర్శనానికి వెళ్ళి వచ్చిన చంద్ర హోంగార్డుతో ఘర్షణ పడ్డారు. అక్కడ నుంచి వెళ్ళిన చంద్ర న్యాయవాది కంఠా ఉదయ్‌కుమార్‌తో కలసి ఆలయం వద్దకు వచ్చారు. గేటు వద్ద స్థానికులకు అభ్యంతరం ఏమిటి? తిరుమల లాంటి దివ్యక్షేత్రాల్లోనే స్థానికులకు అనుమతిస్తుంటే శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభ్యంతరాలేమిటి? ఇబ్బందులు కల్గించట మేమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. అంతేకాకుండా రాతమూలకంగా హోంగార్డు మీద ఫిర్యాదు చేయటానికి సిద్ధమయ్యారు. అంతేకాక అనధికారికంగా గేట్లు ఏర్పాటు చేసి భక్తులను ఇబ్బందులు కల్గించటం ఎందుకని అంటూ నిలదీశారు. దీనిపై స్థానికులైన న్యాయవాదులు చాలా సేపు పేచీ పడ్డారు. చివరకు చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు కలుగజేసుకున్నారు. ఆవేశంగా మాట్లాడుతున్న యువకులను బుజ్జగించి పంపారు.

## వెల్లం పాడులో క్రికెట్ టోర్నమెంట్

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 13 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి మండలం వెల్లం పాడులో శుక్రవారం మండలంలోని నాయకుడు, రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధం నాయుడు ఆర్థిక సహాయంతో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లినేని జగన్నాధం నాయుడు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి యువ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు వివరించారు. వెల్లంపాడు క్రికెట్ అసోసియేషన్ సారధ్యంలో సంక్రాంతి సందర్భంగా పోటీలు నిర్వహించుటకు నిర్ణయించగా జగన్నాధం నాయుడు ముందుకు వచ్చారని వివరించారు. జగన్నాధం నాయుడుకు గ్రామానికి చెందిన యువకులు ఘన స్వాగతం పలికారు. టోర్నమెంటులో పాల్గొంటున్న జట్లకు క్రికెట్ కిట్‌లను పంపిణి చేసారు. ఈ టోర్నమెంట్లో పరిసర గ్రామాల్లోని 26టీంలు పాల్గొన్నాయని వివరించారు. మూడు రోజుల పాటు టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ వివరించారు. విజేతలకు రూ.20వేలు, రన్నర్‌కురూ.10వేలు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. పోటీలను నిర్వాహకులు శ్రావణ్, కుమార్, సుమన్, వాసుల సారధ్యంలో నిర్వహిస్తున్నారు

## కనబడుట లేదు



శ్రీకాళహస్తి రూరల్,జనవరి 13 ప్రభాతవార్త :
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం వికృతమాల గ్రామానికిచెందిన కరణం వరప్రసాద్(60) కనబడుట లేదని పోలీసులకు శుక్రవారం పిర్యాదు అందింది. సిఐ శ్రీమరి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వికృతమాలకు చెందిన కరణం వరప్రసాద్ ఈ నెల 7న చికిత్స నిమిత్తం తిరుపతి భవాని నగర్‌లోని ప్రవేటు ఆసుపత్రికి వెళ్ళాడు అక్కడ తప్పిపోయినట్లు పిర్యాదు చేసారు. ఎవరికైనా తెలిస్తే ఫోన్ నెంబర్ 9989756730, 7032885030లకు తెలియజేయాలని కోరారు.

## బస్సుకిందపడి నెల్లూరువాసి మృతి

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి పానగల్‌లోని పొన్నాలమ్మ గుడి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరుజిల్లా కొవ్వూరు నియోజకవర్గం రేగడి చిలకకు చెందిన నరసింహులు (65) అక్కడికక్కడే మృతి చెందినట్లు సిఐ అంజూ యాదవ్ తెలిపారు. ఆమె అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రేగడి చిలక గ్రామానికి చెందిన నరసింహులు ఆయుర్వేద మందులు విక్రయించుకుంటూ, జ్యోతిష్యం చెబుతుండే వాడు. ఆయన శుక్రవారం తిరుపతి లో తమిళనాడుకు చెందిన ఎసి బస్సుల్లో ఎక్కి శ్రీకాళహస్తికి వచ్చారు. పొన్నాలమ్మ గుడి వద్ద బస్సు దిగినట్లు వివరించారు. అయితే బస్సు దిగిన నరసింహులు బస్సు కింద పడ్డారు. తలపై భాగంలో బస్సు దూసుకుపోవటంతో అక్కడికక్కడే మృతి చెందాడని వివరించారు. సంఘటన స్థల వద్ద సిఐ అంజూయాదవ్, ట్రాపిక్ ఎస్ఐ జనార్ధన్‌నాయుడులు పరిశీలించారు.

## దేశం నాయకులు మృతి తీరనిలోటు..సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త :



దేశం నాయకులు మృతి తీరని లోటని నియోజవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొణతనేరి పంచాయతీకి చెందిన గుర్రప్ప నాయుడుకండ్రిగ హరిజనవాడ కు చెందిన ఎస్సీసెల్ సీనియర్ నాయకులు సింగమాలసుందరయ్య, ఎగువకొణతనేరి గ్రామానికి చెందిన గాలిధనంజయనాయుడు, మరియు పూడి గ్రామానికి చెందిన ఎస్సీసెల్ నాయకులు ప్రభాకర్ తల్లి వెంకటసుబ్బమ్మల భౌతికకాయాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, పాలసొసైటీ మాజీ చైర్మన్ మునిరాజనాయుడు, ఎస్సీసెల్ కార్యదర్శి భాస్కరయ్య, వెంకటముని, రవి, సుజిత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గోపి, సన్నీ, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్..ట్రాఫిక్..

## -అష్టదిగ్బంధనంలో తేరువీధి
## -ప్రజలకు తప్పని తిప్పలు

శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త :
పవిత్ర పుణ్యక్షేత్రం ట్రాఫిక్ చిత్తడిలో కూరుకుపోయింది. గత రెండు రోజులుగా ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలు, ప్రయాణీకులు, పట్టణవాసులు, ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో నెహ్రూవీధిలో దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. అయితే అటు బిక్షాల గోపురం వద్ద పోలీసులు ఎవ్వరినీ అనుమతించకుండా బారికేడ్లు, మరోవైపు కృష్ణారెడ్డి మండపం వద్ద బారికేడ్లు ఏర్పాటుచేయడంతో తేరువీధిలో జనం కనుమరుగయ్యారు. దీంతో నెహ్రూవీధిలో ట్రాఫిక్ చిక్కులు, మరోవైపు పెండ్లిమండపం వద్ద నుంచి నగరివీధిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆర్టీసి బస్సులను కూడా డిపో నుంచి బైపాస్ రోడ్డుకు మళ్లించగా మరోవైపు తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వచ్చే బస్సులను మార్కెట్‌కమిటీ వద్దనే నిలిపివేశారు. అయితే నెహ్రూవీధి, పెండ్లిమండపం, బజారువీధి, నగరివీధుల్లో ఆటోలు, కార్లును అనుమతించకపోతే ట్రాఫిక్ తిప్పలు తగ్గుతాయి. ఇక వైఎస్ఆర్ విగ్రహం నుంచి మార్కెట్‌వీధికి కొన్ని వాహనాలును మళ్ళించారు. అవగాహన లేకుండా పోలీసులు అమలు చేస్తున్న ఆంక్షలు ప్రజలకు ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఓసారి నెహ్రూవీధి, నగరివీధులను పరిశీలిస్తే ద్విచక్రవాహనాలు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్‌చేసి దుకాణాలకు వెళ్ళిపోతున్నారు. దీంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. నాలుగుమాడావీధుల్లో కార్లు, షేర్‌ఆటోలును అనుమతించకుండా కేవలం ద్విచక్రవాహనాలను మాత్రమే అనుమతించినట్లయితే కాస్త ట్రాఫిక్ తిప్పలు తప్పుతాయి. పోలీసులు దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# తిరుపతి డివిజన్

## పండుగలు శుభాకాంక్షలు తెలిపిన మేయర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 13 ప్రభాతవార్త :



2023 సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని, ప్రజలు జీవితాల్లో మరింత వెలుగులు నింపాలని, అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మేయర్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల అభ్యున్నితే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో నగరం అభివృద్ధిలో ముందు వరుసలో ఉందని తెలిపారు. నగర ప్రజలకు తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, బోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.

## ముగిసిన ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవం

నారాయణవనం, జనవరి 13 ప్రభాతవార్త :



నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో వెలసిన ఆండాల్ అమ్మవారి నీరాట్టు ఉత్సవ వేడుకలు శనివారంతో ఘనంగా ముగిసి ంది. టిటిడి ఆద్వర్యంలో ఈ ఉత్సవాలను ఏడురో జుల పాటు ఘనంగా నిర్వహించడం జరి గిందని ఆలయపర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో చివరిరోజు శనివారం ఉదయం 6గంటల కు అమ్మవారి ఆలయంలో శుద్ధి, నిత్యపూజాకార్యక్రమాలను నిర్వహించిన తర్వాత స్వామి, అమ్మవార్లను తిరుప్పావై ప్రవచనంతో మేల్కొల్పారు. అనంతరం అభిషేకం చేసిన తర్వాత వివిధ రకాల పుష్పాలతో సుమనోరంగా అలంకరించారు.

## వైసిపి నేతలు మూల్యం చెల్లించక తప్పదు.

–జనసేన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్

తిరుపతి ప్రెస్‌క్లబ్, జనవరి 13 ప్రభాతవార్త:




జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పట్ల వైసిపి మంత్రుల దుర్భాషలు, దూషణలకు మూల్యం చెల్లించక తప్పదని పార్టీ చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జనసేన ఆధ్వర్యంలో తమ అధినేత నిర్వహించిన యువశక్తి కార్యక్రమం విజయవంతం కావడంతో జీర్ణించుకోలేని వైసిపి మంత్రులు కడుపుమండి దుర్భాషలాడటం మంచిది కాదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఇన్‌చార్జ్ కిరణ్ రాయల్, పట్టణ ఇన్‌చార్జ్ రాజా రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి: సిఈఓ

రామచంద్రాపురం, జనవరి 13 ప్రభాతవార్త:



ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సిఈఓ రామారావు అన్నారు. శుక్రవారం కుప్పం బాదూరులో మహిళా రైతు లాలెమ్మ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సే ంద్రీయ పద్ధతిలో సాగు చేసే పంటలకు ప్రభుత్వం పలు రకాలుగా ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలను పండించి అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం మునిరత్నం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి దాతల వితరణ



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:
చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయ పునర్నిర్మాణానికి పలువురు దాతల తమ వంతు వితరణ చేసినట్లు ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం కూరపాటి గీతాశంకర్ రెడ్డి రూ.10 లక్షలు, తెలగంశెట్టి మునిరాజ (కోట గ్రామం) రూ.101016/-లు, సక్కూరు సక్కుబాయి రూ.100001/-లు, వి.జయదేవ్ కుమార్ (సంజీవరాయనిపల్లి, పూతలపట్టు), రూ.100000/-లు, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు వినియోగించాలని కోరుతూ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్‌తో పాటు ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.


## శ్రీ విద్యా డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

పుత్తూరురూరల్, జనవరి 13 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపాలిటీ గోవింద పాళెంలోని శ్రీ విద్యా డిగ్రీ కళాశా లలో సంక్రాంతి సంబరాలను భోగి మంటలు వేసి ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను విద్యార్థులు, అధ్యాపకుల సమక్షంలో సాంప్రదాయక దుస్తులతో జరుపుకోవడం సంతోషంగా ఉందని కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు.

## సుఖ సంతోషాలతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలి



కేవీబీ పురం, జనవరి 13 ప్రభాతవార్త:
మండలంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో భోగభాగ్యలతో సం క్రాంతి పండుగను జరుపుకోవాలని కేవీబీ పురం తహసీల్దార్ ద్వారకనా థరెడ్డి ఒక ప్రకటనలోతెలిపారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను అందరూ సుఖసంతోషాలతో భోగి మంటలు వేసి పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మునిరత్నం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంయాదవ్, మండల ఆఫీసర్ మల్లీరాజు, తేజ, మణికంఠ, కేవీబీ పురం మండల విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ ముని గోపాల్, మండల హెడ్ క్వార్టర్ పంచాయతీ కార్యదర్శి గోవిందస్వామి, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు. అలాగే వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలందరికి సుఖ సంతోషాలతో సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకోవాలని వైసీపీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్, మండల ఫైనాన్స్ డైరెక్టర్ పి.వసంతాలాల్‌బాబు యాదవ్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు అగ్రహారం హరిబాబురెడ్డి, మండల మైనారిటీసెల్ అధ్యక్షులు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు, మండల కార్యదర్శి పర్వతాల బాలసుబ్రహ్మణ్యం, సత్యవేడు నియోజకవర్గ అధ్యక్షురాలు బుర్ర మాధవిరెడ్డి, మండల అధ్యక్షురాలు గాలి రమాప్రభ, దామునాయుడు, పూడి శాస్త్రిరాజు, చిరంజీవులు, పూడి మని, కేవీబీపురం గ్రామ సర్పంచ్ గిరి, ఎంపీటీసీ అయ్యప్పరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధలను అగ్నికి ఆహుతి ఇచ్చేదే 'భోగిపండుగ'

తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త

పతి సంవత్సరం ఆంగ్లనెలల ప్రకారం జనవరినెలలోను, తెలుగు నెలల ప్రకారం పుష్యమాసంలోను శ్రద్ధతో ఆచరించే పెద్దల పండుగగా పేరొందిన పెద్దపండగే మకరసంక్రాంతి. దక్షిణాయనానికి ఆఖరిరోజు, ధనుర్మాసానికి ఆఖరిరోజు, మకరసంక్రాంతికి ముందు రోజు భోగి పండుగ. సాధారణంగా భోగి అంటే తొలిరోజు అని అర్థం. పెద్దపండుగగా పిలువబడే మూడు రోజుల సంబరాలు సంక్రాంతికి తొలిరోజును భోగిగా పిలుస్తారు. దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, భాదలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తు రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలే 'భోగిమంటలు'. భోగి రోజు సాయంత్రం పిల్లలకు పోసే భోగి పళ్ల సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఆశీస్సులుగా పేర్కొంటారు. ఈపండుగనాడు సంక్రాంతి సంబరమంతా పిల్లలదే. తెల్లవారు జామునే లేని భోగిమంటలు వేయడం, సాయంత్రం భోగి పండ్లు పోయించుకోవడంతో హుషారుగా ఉంటారు. 'భగ' అన్న పదం నుంచి 'భోగి' అన్న మాట పుట్టిందని చెబుతారు. భగ అంటే మంటలు లేదా వేడిని పుట్టించడం అని అర్థం. రేగిపండ్లను సంస్కృతంలో 'బదరీఫలం' అంటారు. తమ పిల్లలకు భోగిపళ్లలో చేమంతి, బంతి



పూలరేకులు, అక్షింతలు, చిల్లరనాణేలు, పాలకాయలు కలిపి చిన్నారుల తలపై పోస్తారు. సాధారణంగా భోగి అంటే సూర్యుణ్ణి అరాధించే అతిపెద్ద ఉత్సవం. సంక్రాంతి పండుగ వచ్చిందంటే తెలుగు లోగిళ్లన్నీ కళకళ లాడుతుంటాయి. కొత్తపంటలు ఇంటికి రావడం, అల్లుళ్లుకూతుళ్ళు, మనుమలు..ఇలా ఇంటి నిండా ఆత్మీయులు ,సన్నిహితులతో ఇళ్ల ఆనందోత్సాహాలతో నిండి ఉంటుంది.

**భోగిరోజున తలంటు :**

భోగిరోజున తలంటుకుని స్నానం చేస్తే ఎంతో మంచిదని పెద్దలు చెప్తుంటారు. తలకు నువ్వులనూనె పెట్టుకుని తలస్నానం చేసుకోవాలని. తప్పనిసరిగా కుంకుడుకాయల రసంతో తలంటి, తల ఆరటం కోసం సాంబ్రాణి పొగవేసుకోవాలి. దీని వల్ల కుదుళ్ల గట్టిపడడం తోపాటు చైతన్యం కలుగుతుంది.

**అన్నదాతల ఆనందం-**

ఎంతో కష్టపడి నేలతల్లిని నమ్ముకున్న రైతులు వేసిన పంటలు చేతికొచ్చిన తరుణం. తాము వేసిన పంటలు చేతికి వచ్చిన తర్వాత కుటుంబసభ్యులతో ఎంతో సంతోషంగా గ్రామాల్లో అన్నదాతలు పండుగనుజరుపుకుంటారు. పంటలు కుప్పలనూర్పిడి అవగానే మిగిలిన పధార్థాలను మంటగా వేయడం వల్ల పుష్యమాస లక్షణమైన చలి తగ్గి వాతావరణం కొంచెం వేడెక్కుతుంది. చిన్నారులు ఈపండుగలను ఎంతో ఆనందంతో జరుపుకోవడం జరుగుతుంది.

## పోరాట స్ఫూర్తిని కొనసాగించండి

-కాసరంకు లోకేష్ సూచన

శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త :



తెలుగుదేశంపార్టీకి కోసం కార్యకర్తలు, నాయకులు పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ శ్రీకాళహస్తి తెలుగుదేశంపార్టీ నాయకుడు కాసరం రమేష్‌కు సూచించారు. శుక్రవారం నారాలోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై వివరించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. యువగళం పాదయాత్రలో యువతను భాగస్వాములను చేయడానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని లోకేష్‌బాబు సూచించారని కాసరం రమేష్ తెలిపారు. బ్రిటీష్ తాతలను తలపించేలా జగన్‌రెడ్డి తీసుకువచ్చిన చీకటి జీవోలకు వ్యతిరేఖంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనల మేరకు తాము చేసిన నిరసన కార్యక్రమాలను నారాలోకేష్‌కు వివరించినట్లు తెలిపారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ద్వారాప్రజల్లోకి వెళ్లి జగన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ఎండగట్టాలని లోకేష్ సూచించినట్లు తెలిపారు.

## సెందెభోగి పండుగ వేడుకల్లో తెదేపా నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త :



తెలుగువారి తొలిపండుగలైన భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో ముఖ్యమైనవి. ఈనేపధ్యంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసి బస్టాండు వద్ద దివంగతనేత స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం ముందు పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ సారధ్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సందెభోగివేసి సంబరాలు చేసుకున్నారు. చీకటి జీవోలను భోగిమంటల్లో వేసి కాల్చివేశారు. ఈసందర్భంగా నియోజవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, భాదలను అగ్ని దేవుడికి ఆహుతి చేస్తు రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలే 'భోగిమంటలు'. భోగి రోజు సాయంత్రం పిల్లలకు పోసే భోగి పళ్లు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఆశీస్సులుగా పేర్కొంటారు. ఈపండుగనాడు సంక్రాంతి సంబరమంతా పిల్లలదే. తెల్లవారు జామునే లేని భోగిమంటలు వేయడం, సాయంత్రం భోగి పండ్లు పోయించుకోవడంతో హుషారుగా ఉంటారు. 'భగ' అన్న పదం నుంచి 'భోగి' అన్న మాట పుట్టిందని చెబుతారని పండుగ విశిష్టతను తెలిపారు. ప్రతి ఒక్కరు పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ పట్టణ ప్రజలకు, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు, దశరధాచారి, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, కాసరం రమేష్, వజ్రంకిషోర్, ఆర్ముగం, మాజీ కౌన్సిలర్ దుర్గా ప్రసాద్, మునిరాజయాదవ్, ఉమేష్‌రావు, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు అవసరమైన సమాచారం అందజేయాలి

-"వార్త"క్యాలండర్ ఆవిష్కరణలో డిఆర్ఓ రాజశేఖర్

చిత్తూరు,జనవరి 13ప్రభాతవార్త:

ప్రజలకు అవసరమైన పూర్తి సమాచారాన్ని సమగ్రంగా తెలియజేయడంలో "వార్త"దినపత్రిక చూపుతున్న చొరవ అభినందనీయమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి, పలు రకాల సేవలు ప్రజలకు తెలియజేస్తూ, నిష్పక్షపాత వార్తలు ప్రచురించడంలో"వార్త"యాజమాన్యం, సిబ్బంది కృషి అభినందనీయమని చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు మేజిస్ట్రేట్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. ప్రజలకు ,ప్రభుత్వానికి మధ్య వారధిగా దినపత్రిక ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన సమాచార వార్తలను ప్రచురించడంలో వార్త ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. మహిళలు, రైతాంగానికి సంబంధించిన పలు కథనాలకు దర్పం పడుతుందని తెలిపారు. "వార్త"దినపత్రిక 2023 నూతన సంవత్సరం క్యాలండర్‌ను శుక్రవారం ఉదయం చిత్తూరు జిల్లా రెవెన్యూ అధికారి, అదనపు మేజిస్ట్రేట్ ఎన్.రాజశేఖర్ ఆవిష్కరించారు. క్యాలండర్‌ను అద్భుతంగాతీర్చిదిద్దారని 'వార్త' దినపత్రిక మేనేజర్ కె.పుణ్యమూర్తిని అభినందించారు.

## ఆధ్యాత్మికనగరం తిరుపతిలో

-ముందే వచ్చిన సంక్రాంతి

-రాయలసీమ రంగస్థలి సంబరాలు





తిరుపతి,జనవరి 13ప్రభాతవార్త:

సహజంగానే తెలుగు సాంప్రదాయాలకు పెద్దపీట వేసేతిరుపతి నగరంలో ఈఏడాది సంక్రాంతి పర్వదినం వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. నాలుగురోజుల సంక్రాంతి పండుగ సంబరాల్లో తొలిగా భోగి, రెండవరోజు సంక్రాంతి(పొంగల్), మూడవరోజు కనుమ, నాల్గవరోజు ముక్కనుమ వేడుకగా ప్రతి ఇంటా జరుపుకుంటారు. ఈ పండుగలను ప్రజలు సాంప్రదాయంగా జరుపుకోవాలని కోరుతూ రాయలసీమ రంగస్థలి, వరసిద్ధి వినాయక కమిటీ నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, సామంచి శ్రీనివాస్, ఆర్‌సి మునికృష్ణ, నవీన్‌కుమార్‌రెడ్డి, గోవిందరాజులు, ఊకా విజయకుమార్, కవిత, మల్లారపు రవిప్రసాద్, దీపక్‌యాదవ్ తదితరులు కలిసి భోగిమంటలు వేయడం, సంక్రాంతిపర్వదినం తలపించేలా రంగవల్లులు తీర్చిదిద్ది, గంగిరెద్దల ఆటలు ఆడించడం ఇందిరామైదానంలో హోరెత్తాయి.

## ముగిసిన ఆండాళ్ నీరాటోత్సవాలు

తిరుపతి,జనవరి 13ప్రభాతవార్త:



ధనుర్మాసం ముగింపున గోవిందరాజస్వామి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆండాళ్ అమ్మవారు గోవిందరాజస్వామి ఆలయం నుండి బంగారు తిరుచ్చిపై రామచంద్రతీర్థకట్టకు వేంచేపుచేశారు. ఇక్కడ మండపంలో కొలువుతీర్చి వేడినీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం భక్తులకు దర్శనమిచ్చి అనంతరం తిరిగి మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ విఆర్ శాంతి, ఎఇఒ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌మూర్తిరాజు పాల్గొన్నారు.

## స్విమ్స్ పరిశోధన విద్యార్థికి డాక్టరేట్ ప్రధానం



తిరుపతినగరం, జనవరి 13 ప్రభాతవార్త :

యూనివర్శిటీలో బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం నందు పరిశోధనలు నిర్వహించిన పి.హెచ్.డి స్కాలర్ నలమోలు రవీనా మధులితకి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ప్రధాన చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ పరిశోధక విద్యార్థిని రవీనా మధులిత అల్లైడ్ హెల్త్ సైన్సెస్ ఆన్ సిలికో ఐడెంటిఫికేషన్ ఆఫ్ పొటెన్షియల్ టార్గెట్స్‌న వ్యాక్సిన్ క్యాండిడేట్స్ అండ్ ఇన్హిబిటార్ డిజైన్ అగైనెస్ట్ మైకోబ్యాక్టీరియమ్ ట్యూబెర్కులోసిస్ అనే అంశముపై పరిశోధనను నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మెహన్, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీధర్‌బాబు, ఆర్.ఎం.ఓ డాక్టర్ కోటిరెడ్డి, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తప్పిపోయిన వ్యక్తి-కేసు నమోదు

.శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త



పట్టణంలోని బహదూరుపేటలో నివాసం ఉంటున్న పోలయ్య కుమారుడు వెంకటేష్(35) ఈనెల 12వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేసినట్లు ఎస్ఐ మహేష్‌బాబు తెలిపారు. తప్పిపోయిన వ్యక్తి నలుపురంగుతో పాటు తెల్లచొక్కా, నలుపురంగు చుక్కలు ఉన్న లుంగీ ధరించి ఉంటాడని ఎస్ఐ వివరించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వెంటనే శ్రీకాళహస్తి టుటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ 9154141887, 9949130717, సిఐ 9440900008 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

## "గోవింద"నామం వినిపించరా!

-కొండ బస్సుల్లో మూగబోయిన ఆడియో పరికరాలు



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

అనాదికాలం నుంచి ఏడుకొండలకు కాలినడకన, వాహనాల్లో చేరుకునే భక్తులు తమ ప్రయాణం సాఫీగా సాగాలని, దారిమధ్యలో(ఘాట్‌రోడ్డుపై) ఎలాంటి ఆటంకాలు కలగకూడదని సాక్షాత్తు శ్రీవేంకటేశ్వర స్వామిని భక్తులు మనస్సుల్లో, మరికొంతమంది గోవింద నామం ప్రతిధ్వనించేలా భక్తిభావం చూపుతున్నారు. అలాంటిది ఇప్పుడు తిరుమల ఘాట్‌లో తిరిగే ఆర్టీసి బస్సుల్లో ఆధ్యాత్మికభావం ఉట్టిపడేలా ఏర్పాటుచేసిన ఆడియో పరికరాలు మూగబోయాయి. హిందు ధర్మవ్యాప్తిలో భాగంగా ఆధ్యాత్మికభావం ఉట్టిపడేలా టిటిడి ఉన్నతాశయంతో ప్రణాళికలు అమలుచేస్తున్నా ఆర్టీసి అధికారులకు పట్టనట్లు కనిపిస్తోంది. తిరుమల నుంచి తిరుపతికి, తిరుపతి నుంచి తిరుమల మధ్య నడిచే ఆర్టీసి బస్సుల్లో "గోవింద"నామం వినిపించడంలేదు. భక్తిభావంతో ..ప్రశాంత మనస్సుతో తిరుమలకు వచ్చే భక్తులను తిరుపతి ఆర్టీసి బస్టాండు, రైల్వే స్టేషన్, విష్ణునివాసం తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసిబస్సులు గమ్యస్థానం చేరుస్తాయి. భక్తులు వెళ్ళే బస్సుల్లో గోవింద నామం వినిపించడంలేదు. ఘాట్‌లో ప్రయాణం ఎంతో ప్రమాదభరితం. అడుగడుగునా ఆపదమొక్కులవాడు రక్షగా వుండాలని....తమతో రావాలని భక్తులు ప్రార్థిస్తుంటారు. ప్రయాణం సాఫీగా సాగి నీ దర్శనం చేసుకోవాలని కోరుతుంటారు. ఇప్పటికీ కొంతమంది ఉత్తరాంధ్ర భక్తులు, మహారాష్ట్ర, తమిళనాడు భక్తులు తిరుమల బస్సుల్లో గోవింద నామాలు వినిపించి కొండెక్కుతున్నారు. తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో భక్తులకు గోవిందనామం వినిపించేలా ఏర్పాటు చేసిన ఆడియోలు కూడా పనిచేయడం లేదు. పైగా బస్సులు బయలుదేరే ముందు భక్తులతోబాటు బస్సు డ్రైవర్ "గోవింద"నామాన్ని ఉచ్చరించాలి. ప్రతిరోజూ 50వేలమంది వరకు భక్తులను ఆర్టీసి అధికారులు చేరవేస్తున్నారు. నూతన సంవత్సరంలో అయినా ఈ బస్సుల్లో గోవిందనామం వినిపింపజేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

## కన్నుల పండువగా శ్రీగోదాదేవి కల్యాణం



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త :

సూళ్లూరుపేటలోని శ్రీ బాలాంజనేయస్వామి దేవస్థానంలో సంక్రాంతి పర్వదిన సంబరాల్లో భాగంగా శ్రీగోదాదేవి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం శుభముహూర్తాన గోదాదేవి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిపారు. దేవస్థానం ఛైర్మన్ అయితా శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## గంగమ్మకు రాహుకాలాభిషేకం



బోయకొండ(చౌడేపల్లి), జనవరి 13 ప్రభాతవార్త :

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణ గావించారు. రాహుకాల సమయంలో అమ్మవారిని అభిషేకించడం వల్ల లోకశాంతి, ప్రజలు సుఖశాంతులతో ఉంటారని భక్తుల నమ్మకం, దీంతో రాహుకాలాభిషేకానికి విశేష స్పందన లభించింది. ఆలయ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్రమౌళిల ఆధ్వర్యంలో అర్చక, అధికార సిబ్బంది సేవలందించారు.

## లోకేష్ పాదయాత్రను జయప్రదం చేద్దాం!

బంగారుపాళ్యం, జనవరి 13 ప్రభాతవార్త:



జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టదలచిన యువగళం పాదయాత్రను జయప్రదం చేద్దామని మండల టిడిపి అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ఈ నెల 27వ తేదీన కుప్పం నుండి పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. ఈ పాదయాత్ర ఫిబ్రవరి 3వ తేదీ రాత్రి మండలంలోని మొగిలికి చేరుకొంటుందని అక్కడే రాత్రి బస చేస్తారన్నారు. తిరిగి 4వ తేదీ మొగిలీశ్వరుడిని దర్శించుకొని పాదయాత్రను ప్రారంభిస్తారని బలిజపల్లి క్రాస్ వద్ద బహిరంగ సభ, శేషాపురం వద్ద ఎన్టీఆర్ విగ్రహానాకి పూల మాల వేసి మహిళలతో ముఖా ముఖి వుంటుందన్నారు. అనంతరం నారా లోకేష్ బంగారుపాళ్యం చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నాలుగు రోడ్ల కూడలి వద్ద బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి, పార్టీ ఉపాధ్యక్షులు కమలనాధరెడ్డి, లోకనాధనాయుడులు, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కోకాప్రకాష్‌నాయుడు, నాయకులు కృష్ణకుమారి, కుమారి, దేవయాని, మంజునాధ్, రమేష్, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌నాయుడు, జాకీర్, శివ, జ్యోతినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్‌లో వడమాలపేటకు పతకాల పంట

వడమాలపేట, జనవరి 13 ప్రభాతవార్త:



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట విద్యార్థులు పతకాల పంట పండించారు. అంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దిమ్మగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 17 రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫ్రీ స్టైల్‌రెజ్లింగ్‌లో ఉదయకుమార్, 10వ తరగతి 71 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని, 60 కిలోల విభాగంలో కంచు పతకాన్ని, గ్రీగో రోమన్‌లో యూనస్ 9వ తరగతి, 55 కిలోల విభాగంలో వెండిపతకాన్ని, జయకుమార్ 10వ తరగతి, 60 కిలోల విభాగంలో కంచు పతకాన్ని, దర్శన్ 10వ తరగతి 71 కేజీల విభాగంలో కంచు పతకాన్ని సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

## వియ్యంకుడు బాబు స్వగ్రామానికి నటుడు బాలయ్య

-విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం

రేణిగుంట, జనవరి 13 ప్రభాతవార్త:



హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వియ్యంకుడు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్వగ్రామం చంద్రగిరి మండలం నారావారిపల్లెకు సంక్రాంతి వేడుకల్లో పాల్గొనడానికి శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు అభిమానులు టీడీపీ కార్యకర్తలు స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి, బాలకృష్ణకు శ్రీకాళహస్తి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి శేష వస్త్రంతో సత్కరించి దేవి దేవరుల ప్రసాదాన్ని అందజేశారు. టీడీపీ యువనేత శ్రీధర్‌వర్మ, పూల బొకేలు ఇచ్చి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి చిన్న రాఘవులుయాదవ్, పార్టీ ప్రతినిధులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి



తిరుపతి క్రైం, జనవరి 13 ప్రభాతవార్త :

సంక్రాంతి పండుగ పురస్కరించుకుని జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి ఐపీఎస్ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, కోడి పందాలు, జూదం తదితర వాటి జోలికెళ్లకుండా భోగి, మకర సంక్రాంతి కనుమ పండగలను సాంప్రదాయంగా ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలని కోరారు.

## సరస్వతి కండ్రిగలో సంక్రాంతి సంబరాలు



శ్రీకాళహస్తిరూరల్,జనవరి 13 ప్రభాతవార్త :

శ్రీకాళహస్తి మండలంలోని సరస్వతి కండ్రిగలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. యువనేస్తం అసోసియేషన్ సారధ్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ముగ్గుల పోటీలను అధ్యక్షులు మునిశేఖర్ సారధ్యంలో నిర్వహించారు. ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లోని గిరిజన, దళితవాడల్లో యువతులన్ని ప్రోత్సహించుటకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు మునిశేఖర్ వివరించారు. ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు వినోద్ సారధ్యంలో నిర్వహించిన పోటీలకు ముఖ్యఅతిధిగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. ఆయన స్పాన్సర్‌గా ఆయన విజేతలకు బహుమతులు అందించారు. మొదటి బహుమతి ఉమకు మిక్సి, రెండవ బహుమతి గ్యాస్ స్టవ్‌ను శ్రావణికి మూడవ బహుమతి మహేశ్వరికి కుక్కర్‌ను అందజేసారు. ప్రోత్సాహక బహుమతిగా కృష్ణవేణికి రూ.500లు, పోటీల్లో పాల్గొన్న 50 మందికి కారియర్‌బాక్సులను అందజేసారు. ఈ కార్యక్రమాల్లో యువనేస్తం న్యాయవాది తిరుమలరెడ్డి, నళిని కుమారి, సుబ్రమణ్యం, కన్వీనర్ హనుమంత్ నాయక్, చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు వినోద్, మాజీ సర్పంచ్ మైరావణ, సభ్యులు వాసుయాదవ్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాక్సో కేసుల్లో జాప్యం లేకుండా చార్జ్‌షీట్లు దాఖలు

- అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్



చిత్తూరు, జనవరి 13 ప్రభాతవార్త:

ఫ్యాక్సో కేసుల్లో జాప్యం లేకుండా చార్జ్‌షీట్లు దాఖలు చేసి సత్వరం సిసి నెంబర్లు తీసుకోవాలని అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ శుక్రవారం తన రేంజ్ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలపై దారుణంగా జరిగిన ఆఘాయిత్యాలకు సంబంధించి ప్రతి ఎస్పీ ఐదు కేసులు, జిల్లాల్లోని డిఎస్పీలు చెరో ఐదు కేసులు వ్యక్తిగతంగా పర్యవేక్షించి కోర్టుల్లో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఒకటి కంటే ఎక్కువ ఫ్యాక్సో కేసులు నమోదైన వారిపై షీట్‌లు ఓపెన్ చేసి వారిపై నిఘా వుంచాలన్నారు. నాలుగు జిల్లాల పరిధిలోని డిఎస్పీలు జడ్జీలను కలిసి కేసులకు సంబంధించి సిసి నెంబర్లు తీసుకొనేలా ఎస్పీలు పర్యవేక్షించాలన్నారు. అలాగే అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పెండెన్సీని 50 శాతం మేరకు తగ్గించాలన్నారు. రౌడీ కార్యకలా పాలపై ఎప్పటికప్పుడు దృష్టి కేంద్రీకరించి రౌడీలు మళ్ళీ పెట్రేగకుండా వారిపై పిడి యాక్ట్ నమోదు చేయాలన్నారు. అలాగే సంక్రాంతి సందర్భంగా ఎక్కడా జల్లికట్టు, కోడి పందెలు, జూదం, బెట్టింగ్‌లు జరుగకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్పకాగినెల్లి, రాహుల్‌దేవ్‌సింగ్, రిశాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## పాడిపంటలు, సిరిసంపదలతో వర్ధిల్లాలి

:టిటిడి ఇఓ ధర్మారెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు

తిరుమల, జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:

హిందువులకు ముఖ్య పండుగ సంక్రాంతి సందర్భంగా దేశ ప్రజలు పాడిపంటలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులుండాలని కోరారు. ప్రతి ఒక్కరికీ స్వామివారి కరుణాకటాక్షాలు నిండుగా అందాలని ఆశిస్తున్నానన్నారు. శ్రీవారి భక్తులకు, దేశప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

**CHANGE OF NAME**

**I,PASUPULATI REDDY RAGHAVA CHARAN MEHATHA** (Old Name) R/o D.No. 19-1-23/R6, Temple Town, Chinthala chenu, TIRUPATI Dist, A.P. Have Changed my Name as **PASUPULETI REDDY RAGHAVA CHARAN MEHATHA** (New Name) S/o **PASUPULETI VENKATESWARA PREASAD.**

**CHANGE OF NAME**

**I, KATTA RAM PRASAD** (Old Name) R/o 4/277 Dwaraka Nagar, Gopavaram, Proddatur, YSR Dist. A.P., Have changed my name as **KATTA RAMA PRASAD** (New Name) S/o **KATTA SURAIAH.**